
నమస్తే తెలంగాణ
# జిందగీ
ఆదివారం | 25 మే 2025
హైదరాబాద్ | www.ntnews.com


అసలు హంతకుడు ఫారెస్ట్ కాంట్రాక్టర్ రావు గారే!
లేదు.. ఆ జేమ్సే హత్యలన్నీ చేస్తున్నది. బండి నడిపే సూరన్న... గుండెలు తీసిన బంటు!
వీళ్లెవరూ కాదహే.. పులి.. పులే మనుషులందరినీ పొట్టన పెట్టుకుంటున్నది.
ఇంతకూ అసలు హంతకుడు ఎవరు? 1985 మే 22న మొదలైన ‘అన్వేషణ’..
నేటికీ చిక్కగానే ఉంది! వంశీ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా తెలుగు
వెండితెరకు కొత్త కిక్కు ఇచ్చింది. ఈ సినిమా ఇప్పటికి ఎన్నిసార్లు
చూసినా.. అసలు హంతకుడు ఎవరో తెలిసినా.. మళ్లీ
చూస్తుంటే వీరందరిపై అనుమానం కలుగుతుంటుంది.
అందుకే నాలుగు దశాబ్దాలు పూర్తిచేసుకున్నా..
అంతు ‘చిక్కని అన్వేషణ’గా ఆదరణ
పొందుతూనే ఉంది.




# అంతు చిక్కని అన్వేషణ

సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రాలు స్తబ్ధుగా సాగుతుంటాయి. స్లో మోషన్‌తోనే ఎమోషన్స్ పండిస్తుంటారు దర్శకులు. మాటలు పొదుపుగా ఉంటాయి. పాటలు ఉన్నా.. అంతగా ఆకట్టుకునేలా ఉండవు. అప్పటి వరకు తెలుగు తెరపై సస్పెన్స్ థ్రిల్లర్స్ జానర్ ఫార్ములా ఇలాగే ఉండేది. సంగీతం, సాహిత్యం, లైటింగ్, టేకింగ్ అనే ఉత్ప్రేరకాలతో ఓల్డ్ థ్రిల్లర్ సినీ ఈక్వేషన్‌ను పూర్తిగా మార్చేశాడు వంశీ.

**టైటిల్** కార్డ్స్ నుంచి ఎండింగ్ వరకు అదే ఇదిగా సస్పెన్స్ కొనసాగిన సినిమా ఇది. వడివడిగా సాగుతుంది. వేడివేడిగా అనిపిస్తుంది. వంశీ అప్పటికి చేసింది రెండు సినిమాలే. మొదటిది మంచుపల్లకి. హృద్యమైన కథ. ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేదు. రెండోది సితార. ఆయనే రాసిన నవల ‘మహల్లో కోకిల’ ఆధారంగా తెరకెక్కింది. దానికి సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీతం తోడైంది. వంశీ టేకింగ్ ఎట్లా ఉంటుందో ఇండస్ట్రీకి తెలిసింది. రీ రికార్డింగ్‌కు ముందు సినిమా చూసిన ఇళయరాజా నాలుగైదు రీళ్ల తర్వాత వంశీని పిలిచి ‘చాలా బాగా తీశావ్’ అన్నాడట. తను నచ్చే సంగీత దిగ్గజం ఆ మాట అనడంతో వంశీ మనసు ఎగిరి గంతేసిందట!


## అన్నీ సూపర్ హిట్లే...

ఈ సినిమాకు కథతోపాటు మాటలు అందించింది వంశీనే! పాటలు రాసింది వేటూరి. పాడింది బాలు, జానకి. చిత్రంలో అన్ని పాటలూ ఎవర్‌గ్రీన్ లిస్ట్‌లో చోటు దక్కించుకున్నవే.
- ఇలలో కలిసే శిథిలాకాశము
- ఎదలో లయ.. ఎగసే లయ
- కీరవాణి.. చిలకలా..
- ఏకాంత వేళ సందిట్లో

**ముచ్చటగా** మూడో సినిమాకు రంగం సిద్ధమైంది. వంశీ అప్పటికింకా కథేం అనుకోలేదు. సస్పెన్స్ థ్రిల్లర్ తీస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన మెదిలింది. అదే విషయం నిర్మాతకు చెప్పాడు. ‘మీరెలాగంటే అలాగ.. బడ్జెట్ మాత్రం మేమెలాగంటే అలాగ’ అన్నాడట నిర్మాత కామినేని ప్రసాద్.
‘ఒక అమ్మాయి అడవిలో ఏదో పరిశోధన చేస్తుంటుంది.. ఆమెను కొందరు వెంబడిస్తుంటారు ఇదీ స్టోరీలైన్’ అని చెప్పాడట వంశీ. నిర్మాతకు భలేగా నచ్చింది.
ప్రపంచంతో తక్కువగా, ప్రకృతితో ఎక్కువగా మమేకమయ్యే వంశీ.. కథా విస్తరణ కోసం అరకు వెళ్లాడు. అక్కడి పచ్చని ప్రకృతి ఒడిలో.. అందమైన కుటీరంలో దిగాడు. కథను దాదాపు ముగించేశాడు. మ్యూజిక్ సిట్టింగ్స్‌కు రమ్మంటూ ఇళయరాజా నుంచి కబురొచ్చింది. హడావుడిగా మర్నాడే బయల్దేరాడు.

**మ్యూజిక్** సిట్టింగ్స్ నాడు.. కథ రాసిన కాగితాల ఫైల్ కోసం పెట్టె తెరిచాడు వంశీ. ఫైల్ అందుకున్నాడు. అందులో కథలేదు. అరకు గెస్ట్ హౌజ్ తాలూకు ఏవో కాగితాలున్నాయి. పక్క గదిలో ఇళయరాజా హార్మోనియం పెట్టె ముందేసుకొని ఆల్రెడీ సెటిలయ్యాడు. కథ ఉన్న ఫైల్‌ను అరకు అతిథి గృహంలోనే మర్చిపోయి వచ్చానని వంశీకి అప్పటికి బోధపడింది. తాను రాసిన కథే అయినా.. సాంగ్ సిట్యుయేషన్స్, కథలో మలుపులు ఇవేవీ ఆయనకు గుర్తుకు రావడం లేదు. ఏదో ధైర్యం చేసి మ్యూజిక్ డైరెక్టర్ ముందుకు వెళ్లాడు. మనసు పొరల్లోంచి వెలికి తీసి సందర్భాలు గుర్తున్నంత వరకు చెప్పాడు. ఒక్కో ట్యూన్ సిద్ధమైపోయింది.

**ఆల్రెడీ** రాసిన కథను.. ఎంత గుర్తు చేసుకున్నా వంశీకి అరకులో తట్టినంత చిక్కగా రావడం లేదనిపించింది. మళ్లీ పూనుకొన్నాడు. ఏదో పూనకం వచ్చినట్టయింది. ఎడాపెడా రాసేశాడు. అనుకున్న సమయానికల్లా స్క్రిప్ట్ సిద్ధమైంది. వెండితెర నవల శైలిలో వచ్చిందా స్క్రిప్ట్. దాన్ని చదివిన వారంతా.. ‘సినిమా హిట్టయ్యాక కొన్ని సినిమాలకు వెండితెర నవల రూపం ఇస్తారు.. మీరు ముందే రాసేశారు’ అన్నారట. కథ కుదిరింది. మ్యూజిక్ అదిరింది. కథానాయికగా భానుప్రియ ఎంపికైంది. హీరో కొత్త ముఖం కావాలన్నాడు వంశీ. ‘సీతాకోకచిలుక’లో నటించిన మురళి (కార్తిక్) అనుకున్నారు. మిగతా పాత్రలకు నటీనటుల ఎంపిక పూర్తయింది.



**తలకోనలో** షూటింగ్ మొదలైంది. అడవిలో సాగే అన్వేషణ అది. ఫారెస్ట్ కాంట్రాక్టర్ రావు (సత్యనారాయణ)కు సంగీతం అంటే ప్రాణం. రాగాలన్నీ.. శుకపికముల కలరవములే అని ఆయన ప్రగాఢ నమ్మకం. ఈ విషయంపై ఉద్గ్రంథం రాయాలనుకుంటాడు. పరిశోధనలు చేస్తాడు. ఆ పనిని పూర్తి చేయడానికి తన స్నేహితుడి కుమార్తె హేమ (భానుప్రియ)ను అడవికి రప్పిస్తాడు! రావు మార్గనిర్దేశనంలో హేమ పరిశోధనలు ప్రారంభిస్తుంది. వనమంతా వసంతంలా విహరిస్తూ.. పక్షుల కిలకిలల్ని రికార్డు చేస్తుంటుంది. ఆ విహంగ గీతాలను భగ్నపరుస్తూ అడపాదడపా పులి గాండ్రింపులు. మనుషుల రక్తం మరిగిన పులి ఏ డొంకలోంచి మీద పడుతుందో అని అందరిలో జంకు. హేమకు పులి అంటే భయం లేదు. కానీ, తనను వెంటాడుతున్న ముగ్గురు ముసుగు మనుషుల గురించే ఆమె ఆందోళన. రావు మేనేజర్ గోఖలేను పులి చంపేస్తుంది. అతని స్థానంలోకి వస్తాడు అమర్ (కార్తిక్). పులి పేరుమీద మనుషులను చంపుతున్న మేకవన్నె పులుల్లాంటి మనుషుల కోసం అతను అన్వేషిస్తుంటాడు. ఈ క్రమంలో అమర్‌కు అందరిమీదా అనుమానం తలెత్తుతుంది. ప్రేక్షకులకూ అవే అనుమానాలు రేకెత్తుతాయి.

**షూటింగ్** టైమ్‌లో ఒకసారి సత్యనారాయణ దర్శకుడు వంశీని పిలిచి.. ‘నువ్వు ఏం తీస్తున్నావో అప్పుడప్పుడూ అర్థం కావడం లేదయ్యా! కానీ, ఏదో గొప్పగా తీస్తున్నావని మాత్రం అనిపిస్తున్నది’ అన్నాడట. అందుకు కారణమూ లేకపోలేదు. రావు పాత్రను చాలా జోవియల్‌గా చూపించిన వంశీ.. అక్కడక్కడా కాస్త కన్నింగ్ లుక్స్ ఇవ్వమనడమే సత్యనారాయణకు అంతుపట్టలేదు. సినిమా క్లయిమాక్స్ వరకూ మనకూ అంతుచిక్కదు. జేమ్స్ ఏమో పైకి పులి కోసం అన్వేషిస్తుంటాడు. అడవిలో అడుగుపెట్టిన అమర్ ఎవరనేదే అతని అసలైన అన్వేషణ. రావు ఇంట్లో పనివాడైన పాండు (రాళ్లపల్లి) కూడా ఏదో అన్వేషిస్తున్నట్టు కనిపిస్తాడు. ఇవి చాలవన్నట్టు.. ఓ మూడు జతల కాళ్లు అడవంతా పరుగులు తీస్తూ హేమను అన్వేషిస్తుంటాయి. ముసుగులు వేసుకున్న ముగ్గురిని మరో జత బూట్లు వెంబడిస్తుంటాయి. ఈ నలుగురినీ కనిపెట్టడమే హీరో అసలు అన్వేషణ!


**ఈ** సినిమాలో నవ్వులు పండించిన పాత్ర పులిరాజు. ఈ రోల్ కోసం రావుగోపాల్‌రావును తీసుకుందామని వంశీ ఆలోచన. కానీ, కుదరలేదు. చివరికి తన చుట్టూ వేషాల కోసం తిరుగుతున్న మల్లికార్జునరావును పులిరాజును చేశాడు. పులిరాజు భార్యగా వై.విజయ చూపులు మత్తెక్కిస్తాయి. పులిరాజు బావమరిదిది తరచూ పులిని చూశానంటూ ఆందోళన పడుతుంటాడు. జేమ్స్, పులిరాజు భార్య రహస్యంగా కలుసుకునే మంచె దగ్గరికి ఎవరూ రావొద్దనే ఎత్తుగడ అతనిది. పులిరాజు కొడుకుగా శుభలేఖ సుధాకర్ అమాయక పాత్రలో కనిపిస్తాడు. ఎడ్లబండి సూరన్న (థమ్) అడపాదడపా తెరపైకి వస్తాడు. అనామక పాత్రలను కూడా సినిమాలో ఎంత కీలకంగా వాడుకోవచ్చో.. వంశీ నిరూపించిన సినిమా అన్వేషణ.

**హేమ** కన్నా ముందు ఇదే అడవికి పరిశోధన కోసం వచ్చిన సుమతి (పొన్ని)ని పులి పొట్టన పెట్టుకుందని అందరి మాట. కానీ, ఆమెను వెంటాడి, వేటాడింది మనుషులే అన్న అమర్ అన్వేషణ.. హేమ సహకారంతో కొలిక్కి వస్తుంది. ఈలోపు అనుమానితులు ఒక్కొక్కరూ చనిపోతుంటారు. అన్ని చావులూ పులి ఖాతాలో చేరుతుంటాయి. కానీ, పులి చంపలేదని ప్రేక్షకులకు తెలిసిపోతుంటుంది. మరి చంపుతున్నదెవరు? ఆ సస్పెన్స్ అలాగే కంటిన్యూ అవుతుంది. క్లయిమాక్స్ చూశాక ‘ఇదిరా థ్రిల్లర్ అంటే’ అని అనకుండా ఉండలేరు.

**ఆ** మనుషులను చంపింది రావు కాదు. రేంజ్ ఆఫీసర్ జేమ్స్ కూడా కాదు. పులి.. అంతకన్నా కాదు.

## రీ రికార్డింగ్ అదుర్స్

**వంశీ,** ఇళయరాజా కాంబినేషన్‌లో ఇది రెండో సినిమానే! అప్పటికే వీరిద్దరి కాంబోలో వచ్చిన ‘సితార’ మ్యూజికల్‌గా కూడా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ‘అన్వేషణ’ పాటలు కూడా ఆ రేంజ్‌లో విజయం సాధించాయి. హాలీవుడ్ టేకింగ్‌ను మరిపించిన ‘అన్వేషణ’లో బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ మహాగొప్పగా ఉంటుంది. సినిమా సక్సెస్‌లో ఇసైజ్ఞాని వాటా ఎంతో ఉందనిపిస్తుంది. అయితే రీ రికార్డింగ్‌కు ముందు సినిమా చూసిన ఇళయరాజా.. గమ్మనకుండా ఇంటికి వెళ్లిపోయారట. ‘సితార’ చూసి తెగ మెచ్చుకున్న ఆయన.. ఇప్పుడు ఏం



మాట్లాడకపోవడంతో తనలో తాను నొచ్చుకున్నాడట వంశీ. ఆయనకు సినిమా నచ్చలేదేమో అనుకున్నాడట. మర్నాడు రికార్డింగ్ టైమ్‌లో ఆర్కెస్ట్రాకు అన్ని నోట్స్ ఇచ్చి.. బయటికి వెళ్తున్న ఇళయరాజా.. వంశీని కూడా రమ్మన్నాడట! అలా ఇద్దరూ వెళ్లి ఓ ఇంటికి చేరుకున్నారు. ఆ ఇంట్లోంచి ఓ పెద్దమనిషి బయటికి వచ్చి రాజాతో మాట్లాడుతూ.. ‘ఎవరీ కుర్రాడు’ అన్నాడట. అప్పుడు ఇళయరాజా.. ‘రాత్రి నీకు ఫోన్‌లో చెప్పా కదా అన్నా! ఒక తెలుగు కుర్రోడు.. ఒక సస్పెన్స్ సినిమా ఇంగ్లిష్ సినిమాలా తీశాడని.. ఆడే ఈడు’ అన్నాడట. ఆ మాటతో వంశీ మనసులో అప్పటిదాకా కొనసాగిన అన్వేషణ ఆనంద తాండవం చేసిందట.

జేమ్స్‌ను, గోఖలేను, ఎడ్లబండి సూరన్నను, పులిరాజు కొడుకును ఈ అందరినీ చంపింది పాండు.
సినిమా ఎన్నిసార్లు చూసినా.. క్లయిమాక్స్‌లోనే ఈ విషయం మనకు రిజిస్టర్ అవుతుంది. తెలిసిన నిజాన్ని విస్మరిస్తూ.. వంశీ క్రియేట్ చేసిన సస్పెన్స్‌లో కూరుకుపోతారు ప్రేక్షకులు. దటీజ్ వంశీ మార్క్ టేకింగ్. అందుకే నలభై ఏండ్లయినా.. ‘అన్వేషణ’కు ఆదరణ అంతే ఇదిగా ఉంది. కావాలంటే ఇంకోసారి చూడండి. ఇంత చదివాక కూడా.. పాండు మీద కన్నా... ఇతర పాత్రల మీదే మీకు అనుమానం మళ్లీ కలుగుతుంది. మీ అన్వేషణ సినిమా కడదాకా కొనసాగుతూనే ఉంటుంది.

...కణ్వస

# అందానికి తేనె అద్దుదాం

**అమోఘమైన** రుచి, అరుదైన లక్షణాలు గల దివ్యౌషధం తేనె. సౌందర్యానికీ, ఆరోగ్యానికీ దోహదపడే సుగుణాల గని. అందుకే ఆహారంలోనూ, ఔషధాల్లోనూ తేనె వాడకం ఎక్కువ. ముఖ్యంగా వేసవిలో తలెత్తే సమస్యలకు చక్కని పరిష్కారం ఇది. చర్మం జిడ్డుగా మారడం, జుట్టు జీవం కోల్పోవడం వంటి వేసవి కాల సమస్యలకు తేనె మంచి ఉపశమనం.

- ఒక టేబుల్ స్పూన్ తేనెకు కొద్దిగా పాలు కలిపి ముఖానికి పట్టించి పదిహేను నిమిషాలపాటు ఆరనివ్వాలి. బాగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి. వారానికి రెండు మూడుసార్లు ఇలా చేయడం వల్ల నల్లని మచ్చలు, మొటిమలు తగ్గుతాయి.
- తేనెలో కొంచెం నిమ్మరసం కలిపి బ్లాక్‌హెడ్స్‌పై రాసి పదినిమిషాల తర్వాత కడిగేయాలి. తరచూ ఇలా చేస్తే బ్లాక్‌హెడ్స్ క్రమంగా తగ్గిపోతాయి.
- కాలిన గాయాలపైన తేనెను పూయడం వల్ల మచ్చలు పడవు. పెదాలను తేనెతో మర్దనా చేస్తే పొడిబారకుండా ఉంటాయి. తేనె మంచి మాయిశ్చరైజర్‌గా పనిచేసి చర్మకాంతిని పెంచడమే కాకుండా, మృదువుగా మారుస్తుంది.
- వెంట్రుకలు నిర్జీవంగా మారితే ఆలివ్‌నూనెలో తేనె కలిపి రాత్రి పడుకునేముందు వెంట్రుకలకు బాగా పట్టించాలి. మర్నాడు తలస్నానం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తే వెంట్రుకలు చిట్లకుండా ఉంటాయి.



# కలలో కాల ప్రయాణం!

## పెండ్యులం

**ఈటీవీ విన్:** స్ట్రీమింగ్ అవుతున్నది
**తారాగణం:** విజయ్ బాబు, అనుమోల్, దేవకి రాజేంద్రన్, ప్రకాశ్ బారె, అమల్ దేవ్ తదితరులు
**దర్శకత్వం:** రెజిన్ ఎస్ బాబు

**మలయాళ** చిత్రసీమ ప్రయోగాలకు పెద్దపీట వేస్తున్నది. సరికొత్త కాన్సెప్ట్‌లను ఎంచుకుంటూ.. తక్కువ బడ్జెట్‌లోనే బ్లాక్‌బస్టర్ హిట్స్ కొడుతున్నది. అలా.. కలల నేపథ్యంలో ‘పెండ్యులం’ తెరకెక్కింది. ఇష్టమైన వారిని కలలోకి ఆహ్వానించడం. నచ్చిన వారి కలలోకి వెళ్లడం సాధ్యమే! అని చెప్పే ‘లూసిడ్ డ్రీమింగ్’ అనే కాన్సెప్ట్‌తో సాగుతుంది కథ. కల–కాలం అనే రెండు అంశాల చుట్టూ తిరిగే మిస్టరీ థ్రిల్లర్ చిత్రమిది. రెండేళ్ల కింద మలయాళంలో విడుదలైన ఈ సినిమా.. తాజాగా ఓటీటీలోకి వచ్చింది. క(థ)లలోకి వెళ్తే.. మహేశ్ నారాయణన్ (విజయ్ బాబు) డాక్టర్. భార్య శ్వేత (దేవకి రాజేంద్రన్), కూతురు తన్మయి (అవని)తో కలిసి ఆస్ట్రేలియా నుంచి భారత్ వస్తారు. ఒక రోజు భార్యాపిల్లలతో కలిసి సరదాగా లాంగ్ డ్రైవ్‌కి వెళ్తాడు. అలా ఒక ప్రదేశానికి వెళ్లిన తర్వాత, గతంలో ఆ ప్రదేశంతో తనకు అనుబంధం ఉన్నట్టుగా ఫీలవుతాడు మహేశ్. గతాన్ని గుర్తుచేసుకోవడానికి ప్రయత్నిస్తుంటాడు. అక్కడే ఓ దుకాణం దగ్గర ఆగి.. టీ తాగుతుంటారు. ఇంతలో తన్మయి పొరపాటు వల్ల కార్ కీస్ డిక్కీలోనే ఉండిపోతాయి. దాంతో, వాళ్లంతా ఆ రాత్రికి అక్కడే ఉండిపోవాల్సి వస్తుంది. మరుసటి రోజు ఉదయాన్నే.. రోడ్డుపక్కన పొదల్లో స్పృహలేకుండా పడి ఉంటాడు మహేశ్. రాత్రి తనను ఓ లారీ ఢీ కొట్టిందని భార్యతో చెబుతాడు. కానీ, ఎలాంటి గాయాలు, యాక్సిడెంట్ ఆనవాళ్లు లేకపోవడంతో.. ఆ మాటలను ఆమె నమ్మలేకపోతుంది. తనకు ఏదో జరుగుతున్నదని మహేశ్ భావిస్తాడు. అదేంటో తెలుసుకోవడానికి జాన్ మాస్టర్‌ను కలుస్తాడు. అయితే, వేరేవారి కలలోకి మహేశ్ వెళ్లడం వల్లే ఈ సమస్య తలెత్తిందని జాన్ మాస్టర్ చెబుతాడు. ఆ కల కన్నది ఎవరనే విషయం తెలిస్తే.. ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెబుతాడు. మరి మహేశ్ ఎవరి కలలోకి వెళ్లాడు? అతని కలలోకి ఎవరెవరు వస్తుంటారు? కొన్ని ప్రదేశాలు అంతకుముందే చూసినట్టుగా మహేశ్‌కు ఎందుకు అనిపిస్తుంది? 15 ఏళ్ల క్రితమే డిస్పోజ్ అయిన లారీ.. మహేశ్‌ను ఎలా ఢీకొట్టింది? తన సమస్యకు పరిష్కారం వెతికే క్రమంలో.. మహేశ్‌కు తెలిసిన నిజాలు ఏమిటి? సినిమాలో కీలకమైన ఆమీర్ – ఏంజెల్ ఎవరు? అని తెలుసుకోవాలంటే.. కలలాంటి ఈ కథలోకి వెళ్లాల్సిందే!




# ఆ విషయంలో కత్రినానే కింగ్!

**ఆర్థిక** విషయాల్లో ఆడవాళ్లు ఆచితూచి వ్యవహరిస్తారనేది తెలిసిందే! అయితే, సామాన్య గృహిణులేకాదు.. స్టార్ హీరోయిన్లయినా డబ్బు విషయంలో చాలా స్పష్టంగా ఉంటారట. బాలీవుడ్ హీరోలకు చార్టర్డ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న బిమల్ పరేఖ్ ఇదే విషయం చెబుతున్నాడు. స్టార్ హీరోలు ఆమిర్‌ఖాన్, రణ్‌బీర్ కపూర్‌తో పోలిస్తే.. ఆర్థిక లావాదేవీల నిర్వహణలో కత్రినా కైఫ్ చాలా తెలివిగా వ్యవహరిస్తుందని అంటున్నాడు. తాజాగా ఓ హాలీవుడ్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బాలీవుడ్ హీరోలు ఆర్థిక లావాదేవీల్లో ఎలా వ్యవహరిస్తారో చెప్పుకొచ్చాడు. ‘డబ్బు విషయాల్లో ఆమిర్ ఖాన్, రణ్‌బీర్ కపూర్ చాలా నిదానంగా ఉంటారు. ఆర్థిక సంబంధమైన చాలా అంశాలు వారికి అర్థంకావు కూడా. ఈ విషయంలో కత్రినా కైఫ్ చాలా బెటర్. ఆమె ఎంతో చురుకైంది. ఆర్థికపరమైన విషయాలపై ఆమె ఎక్కువ ఆసక్తి చూపుతుంది’ అంటూ చెప్పుకొచ్చాడు. ఇక రణ్‌బీర్‌కు చెందిన సాకర్ జట్టుతోపాటు ఆర్థిక విషయాల్లోనూ ఆయన జోక్యం తక్కువగా ఉండేదట. తుది నిర్ణయాలన్నీ ఆయన తండ్రి, దివంగత రిషి కపూర్ మాత్రమే తీసుకునేవారట. ‘ఇప్పుడు రిషి సర్ లేరు. జట్టును ఎవరు నడిపిస్తారో చూడాలి. కపూర్ కుటుంబం నుంచే ఎవరైనా వ్యాపారాన్ని చూసుకుంటారని రణ్‌బీర్ భావిస్తున్నారు’ అంటూ వెల్లడించాడు. ఇక ఆమిర్ విషయానికి వస్తే.. సినిమా కోసం ముందుగానే డబ్బు తీసుకోవడం గానీ, లాభాల్లో వాటాగానీ ఆమిర్ పట్టించుకోడట. ‘నిర్మాతలు డబ్బు పోగొట్టుకోకూడదన్నది ఆమిర్ ఫిలాసఫీ. అందుకోసం చాలా తక్కువ రెమ్యునరేషన్ తీసుకుంటారు. ఒకవేళ సినిమా బాగా ఆడి.. లాభాలు వస్తే వాటా తీసుకుంటానని చెబుతాడు. కానీ, సినిమా హిట్ అయినా.. ఆమిర్ తీసుకునేది చాలా తక్కువ మొత్తమే!’ అంటూ చెప్పుకొచ్చాడు. ‘కత్రినా కైఫ్ మాత్రం వీరిద్దరిలా ఉండదు. డబ్బుకు సంబంధించిన అన్ని విషయాలనూ తన అదుపులోనే ఉంచుకుంటుంది. ఏ సినిమాకు ఎంత తీసుకోవాలి? వాటిని ఎలా పెట్టుబడులకు మళ్లించాలి? అనే విషయాలపై పూర్తి అవగాహనతో ఉంటుంది’ అంటూ చెప్పుకొచ్చాడు. ఇక బిమల్ పరేఖ్ విషయానికి వస్తే.. ఆమిర్ ఖాన్‌కు చాలా కాలంగా చార్టర్డ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా రణ్‌బీర్‌కూ ఆర్థిక సలహాదారుడిగా వ్యవహరిస్తున్నాడు.





# స్టార్ అయినా సామాన్యురాలిగానే!

**స్మితా పాటిల్..** అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో తన పవర్‌ఫుల్ నటనతో ఆకట్టుకున్న నటి. మిర్చ్ మసాలా, మంథన్, అర్ధసత్య, అర్థ్, మండీ లాంటి ఎన్నో విజయవంతమైన సినిమాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అయితే, బీటౌన్‌లో స్టార్ హీరోయిన్ అయినా.. సెట్‌లో మాత్రం ఎంతో సాదాసీదాగా ఉండేదట. లైట్‌మెన్‌తో కలిసి కింద కూర్చొని భోజనం చేసేదట. ఈ విషయాన్ని స్మితా పాటిల్ కొడుకు, నటుడు ప్రతీక్ స్మితా పాటిల్ గుర్తు చేసుకున్నాడు. ఇటీవలే నాని హీరోగా వచ్చిన ‘హిట్–3’ చిత్రంలో ‘ఆల్ఫా’గా కనిపించిన ప్రతీక్.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడాడు. ఈ సందర్భంగా తన తల్లి స్మితా పాటిల్‌కు సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నాడు. ‘ఎక్కడ షూటింగ్ జరిగినా.. అమ్మ ఎప్పుడూ ఇంటి నుంచే భోజనం తీసుకునేవారు. సెట్‌లోనూ హీరోలతో కలిసి కాకుండా.. లైట్‌మెన్లతోనే ఆహారం పంచుకునేవారు. నేలపై కూర్చొనే తినేవారు’’ అంటూ గుర్తుచేసుకున్నాడు ప్రతీక్. అయితే, ఒకసారి అమితాబ్ బచ్చన్ సినిమా షూటింగ్ సమయంలోనూ అలాగే చేస్తే.. బిగ్‌బీ పిలిచి స్మితను మందలించారట. ‘మీరు లైట్‌మెన్లతో కలిసి నేలపై కూర్చొని భోజనం చేయడం మంచిదే! కానీ, ఇలాంటి ప్రవర్తన మాకు చెడ్డపేరు తీసుకొస్తుంది. మీరు మాతోనే కలిసి భోజనం చేయాలి’ అని అన్నారట. అమితాబ్‌తో కలిసి శక్తి (1982), నమక్ హలాల్ (1982), పేట్ ప్యార్ ఔర్ పాప్ (1984) వంటి చిత్రాలలో కలిసి పనిచేసింది స్మిత. జయప్రద ప్రధాన పాత్రలో నటించిన షరాబీ (1984)లో స్మిత అతిథి పాత్రలో మెరిసింది. పూణెలో పుట్టిపెరిగిన స్మిత.. ముంబయి దూరదర్శన్‌లో మరాఠీ వార్తలు చదివేది. ఒక ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ స్టూడెంట్.. తన డిప్లొమా కోసం తీసిన చిత్రంలో స్మితా పాటిల్ నటించింది. తర్వాత శ్యామ్ బెనెగల్ దర్శకత్వంలో వచ్చిన చరణ్‌దాస్ చోర్ (1975) చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసింది. 1970లలో బాలీవుడ్ టాప్‌హీరోయిన్లలో ఒకరిగా వెలుగొందింది. హీరోయిన్‌గా రాణిస్తున్న సమయంలోనే.. బాలీవుడ్ నటుడు రాజ్‌బబ్బర్‌ను వివాహం చేసుకున్నది. ప్రతీక్ పుట్టినప్పుడే.. అనారోగ్యంతో కన్నుమూసింది. ఇక ప్రతీక్ స్మితా పాటిల్ కూడా బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి.. విలక్షణ నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు.